నేడు ఆటిజంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కడప సిటీ : పిల్లల ఎదుగుదల, తెలివితేటలు, ఎదుగుదలలోని లోపాలు, చదువులో వెనుకబాటుతనం, మాట సమస్యలు, వినికిడి లోపాలు మొదలగు సమస్యలపై అలాగే ఆటిజమ్- ఆక్టివిటీ, బుద్ధిమాంద్యం తదితర సమస్యలపై అనుభవజ్ఞులైన వైద్యులచే ఆదివారం ఉదయం 10గంటలకు నగరంలోని ఐఎంఎ హాలులో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని అస్వార్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పాల్గొంటారని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు. ముఖ్యంగా ప్రముఖ చిన్నపిల్లల మానసిక వైద్యుడు డాక్టర్ ఎన్.సోమశేఖర్ (రెయిన్ బో హాస్పిటల్ హైదరాబాద్), ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ నాగేంద్రప్రసాద్ డాక్టర్ కె. ఓబులరెడ్డి, డాక్టర్ వంశీధర్ వంటి ప్రముఖ డాక్టర్లు కార్యక్రమానికి హాజరై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

- 7వ రోజుకు చేరుకున్న సమ్మె

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికుల సమ్మె 7వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రెండు నెలలుగా అనేక రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వము పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్లారని తెలిపారు. ప్రభుత్వం చర్చలతో కాలయాపన చేస్తుందే తప్ప కార్మికులకు న్యాయం చేసింది ఏమీ లేదని చెప్పారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, గతంలో ఉన్న జీవో 36 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేయాలని పోరాటం చేస్తుంటే అధికారులు కార్మికులను బెదిరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అడిషనల్ వర్కర్స్, సెక్రెటరీతో పని చేసుకుంటూ నీళ్ల సమయాకి రాకుంటే కార్మికులపై నిందలు వేస్తున్న అధికారులు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. 25 సంవత్సరాల నుంచి ఇదే సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజినీర్ కార్మికులు, లైటింగ్, వాటర్, హార్టికల్చర్, కంప్యూటర్ పని చేస్తూ అటు ప్రజలకు ఇటు అధికారులకు పనిచేస్తున్న ఈరోజు అధికారులు నిందలు వేయడం చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌లో పనిచేస్తున్న కొంతమంది బినామీ కాంట్రాక్టర్లకు పర్మిలు ఇచ్చి వాళ్ల ద్వారా పనులు చేయించుకుంటూ కార్మికుల కడుపు కొడుతున్న ఆప్కాస్ కార్మిక ద్రోహులు అన్నారు. సమ్మె అనంతరం కార్మికుల ద్వారా సరైన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలన్నారు. కేవలం రూ.13,807 వేతనంతో ఇంజినీరింగ్ కార్మికుడు ఎలా బతుకుతున్నాడని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.25వేల వేతనం ఉన్న చిన్న స్థాయి ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. డిమాండ్లు పరిష్కరించిన పక్షంలో సోమవారం నుంచి సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.విజయభాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్.గోపి, జిల్లా ఉపాధ్యక్షులు కె. తిరుపాల్, సహాయ కార్యదర్శిలు ఆనందరావు, బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు సుంకర రవి వై.ఎం.కేశవులు, డ్రైవర్ యూనియన్ నాయకులు సుంకర కిరణ్, వర్కీ ప్రెసిడెంట్ కంచపాటి శ్రీరామ్, కార్మికులు రామ్మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, గురవయ్య, ఆంజనేయులు, చాముయ్య, హరి, సన్నిధానము బుజ్జిబాబు, బద్రి, వెంకటశివ, ఆనంద, వెంకటేష్, ఆజంపుద్దీన్ బాషా, గోపాల్, నరసింహ, ఎల్లయ్య, చిన్న రాయుడు, జయరాము, చలమయ్య, నాగరాజు, కొండమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

గత 20-25 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి కోరారు. స్థానిక మార్కెట్ యార్డులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలి అన్నారు. 2022 పిఆర్‌సి అరియర్స్ రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చినట్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఆపరేటర్లందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని కోరారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్లను నియమించాలని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ ఆగస్టు 7న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు సర్కిల్ డివిజన్ నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు లెనిన్ బాబు, గౌరవ సలహాదారుడు పోలయ్య, అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కార్యదర్శి నాగ శేషయ్యకోశాధికారి బాలసుబ్బయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ విక్టర్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, రెడ్డి శ్యామ్, శ్రవణ్, దిలీప్, నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, కమిటీ సభ్యులు శ్రీకాంత్, రమణ, హరినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు సంజీవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ప్రొద్దుటూరు డివిజన్ కార్యదర్శి బాబు, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ఆధిపత్యం కోసం తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

- సినీ ఫక్కీలో దాడి

- సైదాపురం వద్ద ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీ

- రాడ్లతో తలలు పగలగొట్టిన దుండగులు

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని ఇనగలూరు గ్రామంలో ఆధిపత్యం కోసం రక్తపాతం చోటు చేసుకుంది. టిడిపిలో ఇరు గ్రుపులకు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఉదయం సైదాపురం వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమరసింహారెడ్డి, హరికిషోర్ రెడ్డిని ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టి రాడ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో ఇద్దరికీ తలపై తీవ్ర గాయాలై రక్తపు మడుగులోకి కూలిపోవడం వల్ల పరిస్థితి విషమంగా మారింది. దీంతో వారిని స్థానికులు తక్షణమే పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కడపకు రిఫర్ చేశారు. ఇరు గ్రూపులు గతంలోనూ పరస్పర ఘర్షణలకు పాల్పడినట్టు సమాచారం. గ్రామంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా గాయపడిన ఇరుగ్రూపులకు చెందిన వ్యక్తులు

కడపపై కర్నూలు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

ఎసిఐ సౌత్ జోన్ అండర్ -16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుపై 66 పరుగుల తేడాతో కర్నూలు జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 157 పరుగులు చేసింది. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 114 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 140 పరుగులు చేసింది. 141 పరుగుల విజయ లక్ష్యంతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 39.2 ఓవర్లలో 117 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. కర్నూలు జట్టు లోని సాయి విజ్ఞ సద్వితంగా బౌలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు. రుత్విక్ కళ్యాణ్ రెండు, వివేక్ రెండు వికెట్లు తీసుకున్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగేశ్వర్‌రెడ్డి

రైతులకు మేలు చేయాలి

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి

ప్రజాశక్తి- వల్లూరు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఎన్నికైన లేబాక నాగేశ్వరరావు రెడ్డి రైతులకు అన్ని విధాలా మేలు చేసేలా కృషి చేసి, తన పదవికి న్యాయం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. శుక్రవారం వల్లూరులో సహకార పరపతి సంఘం చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు మేలు జరిగినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. పరపతి సంఘం ద్వారా అధికారులను మమేకం చేసుకుంటూ నాగేశ్వర్‌రెడ్డి సకాలంలో రైతులకు రుణాలు, ఎరువులు, తదితర సబ్సిడీలు అందేలా చూడాలని తెలిపారు. మండలంలో 4,000 మంది రైతులు ఉండగా 1100 మందికి మాత్రమే ప్రభుత్వం ద్వారా సబ్సిడీతో కలిగిన ఎరువులు, రుణాలు అందుతున్నాయని చెప్పారు. నూరు శాతం రైతులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. అనంతరం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పథకాలు, రుణాలు, ఎరువులు సకాలంలో రైతులకు అందేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో జనసేన కమలాపురం ఇన్‌ఛార్జి ఇందిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, జె.సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 1996-2000 సంవత్సరంలో ఇంజినీరింగ్ పట్టభద్రులై దాదాపు 25 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల కలిశారు. శనివారం నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని యాజమాన్యం ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించింది. వివిధ దేశాలలో ఎక్కడెక్కడో ఉద్యోగాలలో స్థిరపడి ఈ సమావేశానికి వచ్చి ఎన్నో మధురానుభూతులకు వేదికగా నిలిచిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ అత్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎంతో సందడిగా గడిపారు. బోలెడన్ని భావోద్వేగా దృశ్యాలు కనిపించడంతోపాటు ఎంతో మధురానుభూతులకు వేదికగా మారింది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల నిమిత్తం వారు వివిధ ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వీరు కలుసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులకు సన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కాలేజీ కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ వి ఎస్ ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి ఎన్ ప్రసాద్, అల్యూమిని డీన్ ప్రొఫెసర్ ఎన్ అమర్నాథ్ రెడ్డి, యాజమాన్యం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పూర్వపు విద్యార్థులు

నిర్బంధంలో ఉన్న ముస్లిములను విడుదల చేయాలి

- ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎస్పికి వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

వేంపల్లె పోలీస్ స్టేషన్‌పై దాడి విషయంలో చాలామంది అమాయకులైన ముస్లిములను ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం వీడియో ఆధా రంగా సమూహంలో కనిపించిన వారిని అరెస్టు చేసి నిర్బంధించి కఠినమైన చట్టాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అన్యాయమని, వారిని వెంటనే విడుదల చేయాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పి ఛాంబర్‌లో ఎస్పి ఇ.జి. అశోక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ పోలీసులు నిర్బంధించిన వారిలో రోజు వారీగా కూలీ చేసుకునే అమాయకులైన ముస్లిములు ఉన్నార నిచెప్పారు. కొందరు నిర్దోషులైన యువత ఉన్నారని, వారి భవిష్యత్తు రీత్య కనికరం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత స్థాయి స్వతంత్ర దర్యాప్తు సంస్థ తో విచారణ జరిపించి నిగ్గు తేల్చాలన్నారు. దోషులుగా తేలిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అమాయకులైన ముస్లిములను విడుదల చేయాలని కోరారు. ఎస్పి స్పందిస్తూ.. ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడం పెద్ద నేరమని, ఇది పోలీసు వ్యవస్థ పై ప్రజలకు అపనమ్మకం కలిగించే చర్య అని చెప్పారు. అన్నారు. ఖచ్చితంగా దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు. భయపడి పరారీలో ఉన్న వారిలో దోషులు, నిర్దోషులుండవచ్చు, వారికై వారు సరెండర్ అయితే విచారణ చేపట్టి నిర్దోషులుగా తేలిన వారిని తప్పకుండా విడుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎస్పిని సయ్యద్ సలావుద్దీన్ శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారీ, సర్దార్, సయ్యద్ తాహిర్ బుఖారీ పాల్గొన్నారు.

నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

కడప నగరంల వారం రోజులకు పైగా కడప మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె కారణంగా కడప నగరంలో అంధకారం, తాగునీటి సమస్యలు నెలకొన్నాయని, అధికారులు, పాలకులు కార్మికుల సమస్యలు పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ సర్కిల్, ఓల్డ్ రిమ్స్ వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు చీకట్లో మొబైల్ టార్చ్ లు చూపుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, కడప మున్సిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల నుండి కడప మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ తెలుగుదేశం పార్టీ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం, కడప మున్సిపల్ కార్పొరేషన్ వైసిపి పాలకవర్గం సమస్యల పరిష్కారంపై స్పందించకపోవడం దారుణమన్నారు. టిడిపి, వైసిపి కార్మిక లకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ విధులను బహిష్కరించి వేతనాల పెంపు, బకాయిల చెల్లింపు, సర్వీసు క్రమబద్ధీకరణ వంటి డిమాండ్లను నెరవేర్చాలని ఆందోళన చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేషన్‌లోని అత్యంత కీలకమైన నీటి సరఫరా విభాగం, శానిటేషన్, లైటింగ్ విభాగం తదితర ఇంజినీరింగ్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సమ్మెతో కడపలోని ప్రధాన రోడ్లతో పాటు వీధులలో కూడా విద్యుత్ దీపాలు వెలగడం లేదన్నారు. దశలవారీగా కార్మికుల ఆందోళన చేస్తున్నట్లు వివరించారు. తాగునీటి సరఫరాల్లో కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నా రన్నారు. వెంటనే కడప ఎమ్మెల్యే మాధవి, మేయర్ సురేష్ బాబు వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ రాజకీయాలను విడనాడి కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల ఆందోళనకు బాసటగా నిలిచిందన్నారు. నిరసన లో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయన రహమతుల్లా ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వెలుగుతో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వినూత్న ఆలోచన శైలిని అలవర్చుకోవాలి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సమాజంలోని సమస్యలు పరిష్కరించేలా వినూత్న ఆలోచన శైలిని విద్యార్థులు అలవర్చుకోవాలని విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. డిగ్రీ, బిఎడ్, బిపిఎడ్, లా విద్యా సంస్థలకు అఫిలియేషన్ ప్రాసెస్ మొదలు పెట్టే ముందు ఆయా విద్యా సంస్థల యజమానులు, ప్రధానాచార్యులతో శనివారం విశ్వవిద్యాలయంలోని శ్రీ అన్నమాచార్య సెనెట్ హాల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం ద్వారా ఇష్టమైన కోర్సును ఎంపిక చేసే అవకాశాలు ఉన్న నేటి తరుణంలో విద్యార్థులకు వెంటనే ఉపాధి అవకాశాలు లభించే వాటిని డిగ్రీలో అందుబాటులోకి తేవాలన్నారు. జాతీయ విద్యా విధానం- 2020 ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఉదహరించారు. విద్యా సంస్థల యజమానులు ప్రధానాచార్యులు నిజాయతీతో పనిచేయాలని, మంచి విద్య ను విద్యార్థులకు అందించి మంచి యువతను దేశానికి అందించాలని, జాబ్ సీకర్స్‌ను కాకుండా జాబ్ ప్రొవైడర్స్‌ను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె. రఘు బాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కొందరు మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకుంటున్నారని, సమాజంలోని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలను విక్రయించే, వినియోగించే వారి వివరాలను పోలీస్ శాఖ కు అందించి అలాంటి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ హై స్కూల్ మెయిన్‌లో ఎస్పి ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా 'ఈగల్' టీం ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు, హత్యలకు సైతం పాల్పడుతూ మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మీ సమీప ప్రాంతాలలో కానీ, మీరు నివసించే చుట్టుపక్కల ప్రాంతాలలో కానీ ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు గుర్తించినా లేదా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలు కంటే వారి కలలను కల్లలుగా చేస్తున్నారని, మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్ తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని తెలిపారు. సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుంచి దూరమవుతున్నారన్నారు. పోలీసు యంత్రాంగం గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు ఏ మూల విక్రయించినా దాడులు నిర్వహిస్తు, రూపుమాపేందుకు కఠిన చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గంజాయి ఎక్కడెక్కడ ఉందో వాటి మూలాలకు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రాణాంతకమైన మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు 'నో' చెప్పేలా పోలీస్ శాఖకు సహకరించి యువత బంగారు భవిష్యత్తు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముబీన్ రెహానా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని వెలికి తీస్తాం : వైసిపి

ప్రజాశక్తి - కడప : బుగ్గ వంక జంగిల్ క్లియరెన్స్‌లో చోటు చేసుకున్న అవినీతిని వెలికి తీస్తామని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. ఈస్ట్ జోన్ విస్తృత స్థాయి సమావేశం, 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం శనివారం ఐఎంఎ హాల్, మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో నగర ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప శాసన సభ్యురాలు, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలనే మళ్లీ తేదీలు మార్చి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ప్రారంభమైన పనులకు ప్రస్తుతం రిబ్బన్ కటింగ్ చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. కడపలో ఎక్కడ చూసినా భూ కబ్జాలు, అవినీతి, మట్టి మాఫియా, ప్రజల మీద దౌర్జన్యాలు జరుగుతున్నాయని, ఇవన్నీ కడప నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు .కడప శాసన సభ్యురాలు చుట్టూ ఉండేవాళ్లంతా భూ కబ్జాలు, అవినీతి చేసే వారేనని విమర్శించారు. ప్రజల సమస్యలతో సంబంధం లేకుండా, వ్యక్తిగత లాభాలు కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి 50కి 50 స్థానాలు గెలుచుకుంటుందని జోస్యం చెప్పారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందైనా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, కో- ఆప్షన్ సభ్యులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - చాపాడు : గండికోటలో ఈనెల14న విద్యార్థిని హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మైదుకూరు పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో విద్యార్థినిలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిలను హత్య , అత్యాచారాలు వంటి దారుణానికి పాల్పడడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమని తెలిపారు. ప్రొద్దుటూరులో చదువుతున్న అమ్మాయి గండికోటలో శవమై కనిపించడం విచారకరమని చెప్పారు. ప్రేమ, పరువు పేరుతో విద్యార్థినులను చంపడం ఘోరమని తెలిపారు. రాష్ట్ర హోమ్ మినిస్టర్ హత్యకు కారకులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటక ప్రాంతం గండికోటలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. గండికోటలో గత కొంతకాలంగా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వల్లూరు : విద్యార్థులు మొబైల్స్ ఫోన్స్‌లో సామాజిక మాధ్యమాల్లో వీక్షించేటప్పుడు ఎంత సమాచారం తీసుకోవాలో అంతే తీసుకొని మిగతాది వదిలేయాలని కమలాపురం సిఐ రోషన్, కడప ఈదుర్‌బాషా పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎపి మోడల్ కళాశాలలో ఎస్పి ఆదేశాల మేరకు విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు పిల్లలపైనా జరుగుతున్న నేరాలను నియంత్రించాలన్నారు. మంచి స్పర్శ ,చెడు స్పర్శ, ఫోక్స్ చట్టం, ఈవ్ టీజింగ్ ర్యాగింగ్, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాలలో జరిగే మోసాలు, శక్తి యాప్ ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్స్ అయినటువంటి 112, 181 ,1098, 1930లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్న, పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ పాల్గొన్నారు.

మాతృ మరణాలను నివారించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. నాగరాజు పేర్కొన్నారు. శనివారం డి ఎం అండ్ హెచ్ ఒ కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందుతుందా లేదా తెలుసుకోవాలని చెప్పారు. ప్రభుత్వాసుపత్రులలో ప్రసవిస్తే అన్ని రకాల జాగ్రత్తలు డాక్టర్లు తీసుకుంటారని పేర్కొన్నారు. గర్భినిని 12 వారాల లోపు గుర్తించాలని తెలిపారు.

అమానవీయం

ప్రజా'దృష్టి'

ఉభయ జిల్లాల్లో ఇటీవల చోటుచేసుకున్న ఘటనల్ని, పాలకుల స్పందనలను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుదగ్గర మామిడికాయల లారీ బోల్తా పడిన ఘటన, కడప జిల్లా జమ్మలమడుగు మండల పరిధిలోని గండికోట పర్యాటక ప్రదేశంలో విద్యార్థిని హత్యకు గురవడం, తాజాగా చాపాడులో భార్యను భర్త హత్య చేసిన నిందితుడు లొంగిపోయిన ఘటనల్ని పరిశీలిస్తే విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రధానమైన ఘటన మామిడికాయల లారీ బోల్తా. 22 మంది ప్రాణాలు ప్రమాదంలో పడిన సంగతి తెలిసిందే. లారీ బోల్తా ప్రమాదంలో తొమ్మిది మంది గాయపడడం, మరో తొమ్మిది మంది మరణించడం, మరో నలుగురు స్వల్ప గాయాలతో కూడిన ప్రమాదం చోటుచేసుకుంది. లారీబోల్తా ఘటన రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగ్గర నుంచి జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు స్పందించడం, ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించడం ఘటన తీవ్రతకు అద్దం పట్టింది. రాజకీయ నాయకుల స్పందన వరకు బాగానే ఉంది. ప్రభుత్వ స్పందన ఆశించినరీతిలో లేకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటన దగ్గర నుంచి ఇతర ఆదుకునే సహాయం వెలుగు చూడలేదు. మెరుగైన వైద్యాన్ని అందించాలనే కోరడం మినహా తుంటెముకలు, పక్కటెముకలు విరిగిన బాధితుల పరిస్థితేమిటనే ఆలోచన చేయకపోవడం ఆందోళన కలిగించింది. తుంటి, పక్కటెముకలు విరిగిన బాధితులు నెలల తరబడి కోలుకునే అవకాశాలు ఉంటాయనే సంగతి అందరికీ తెలిసిందే. బాధితుల సంక్షేమంపై దృష్టి సారించి ఉంటే బాగుండేది. ఎర్రగుంట్ల మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థి వైష్ణవి హత్య మిస్టరీగా మారింది. కర్నూల్ రేంజ్ డిఐజి, కడప జిల్లా ఎస్పి, డిఎస్పి స్థాయి పోలీసు అధికారుల సీనియారిటీ హత్య కేసు ఛేదనలో వెలవెలబోతోంది. ప్రొద్దుటూరు కళాశాల నుంచి బైక్‌పై వెళ్లిన యువతీ, యువకుల్లో యువకుడు అమ్మాయిని అక్కడే వదిలేసి తిరిగి రావడానికి గల కారణాలు ఏమిటో తెలియడం లేదు. అసలు ఇద్దరు ఎందుకు వెళ్లారు...ఎందుకు అమ్మాయిని అక్కడే వది లేసి ఎందుకు రావాల్సి వచ్చిందో తెలపడం లేదు. ప్రేమికుడైన యువకుడికి, తల్లిదండ్రులకు తెలియకుండా ఎవరు హత్య చేసి ఉంటారో అంతు చిక్కని పరిస్థితి నెలకొంది. హత్య కేసు వెనుక రాజకీయం ఏమైనా నడుస్తోందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందువల్లే పోలీసులు వాస్తవాలను వెల్లడించడం లేదా సంశయాలూ ఉన్నాయి. పోలీసులు వైష్ణవి హత్యకు దారి తీసిన ప్రాథమిక కారణాలను సకాలంలో వెల్లడించడం లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతుండడం గమనార్హం.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్

విద్యార్థులు మంచి నడవడికతో మెలగాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

విద్యార్థులు మంచి నడవడికతో మెలగాలని మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ సూచించారు. మైదుకూరు విఆర్ జూనియర్ కళాశాలలో శనివారం ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సమాజంలో జరిగే అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థి దశ కావడంతో కేవలం చదువుపై దృష్టి సారించాలన్నారు. సిఐ రమణారెడ్డి విద్యార్థులకు మంచి, చెడు అంశాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వెంకటరాముడు, ప్రిన్సిపల్ తిరుమలేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ సూచిం చారు. పులివెందుల రోడ్డులోని ఉర్దూ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం ఆయన మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కౌమర దశలో విద్యార్థులు ఎక్కువగా చదువు పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. మత్తు పదార్థాల అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలపై దృష్టి పెట్టకుండా చదువుపైనే ధ్యాస ఉంచాలని సూచించారు. ఆడపిల్లలు జాగ్రత్తగా ఉంటేనే జీవితం సుఖంగా సాగుతుందని వివరించారు. సమాజంలో జరిగే వాటిపై కూడా అవగాహన కలిగి ఉండాలని కోరారు. బాలికలు ప్రమాదంలో ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయితే ఎపి ఎడారే

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణా నదికి ఎగువ రాష్ట్రమైన తెలంగాణా కృష్ణా నది మీద అక్రమంగా నిర్మిస్తున్న పాలమూరు -రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు పూర్తయితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఎడారి అవుతుందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం రిజర్వాయర్‌లో 817.50 అడుగుల నుంచి ఏడాదికి 90 టిఎంసిలు ఎత్తి పోసే విధంగా పాలమూరు-రంగారెడ్డి, 30 టిఎంసిలు ఎత్తి పోసే విధంగా డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను తెలంగాణా రాష్ట్రం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులు అక్రమ ప్రాజెక్టులకు బచావత్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ద్వారా నీటి కేటాయింపులు లేవన్నారు. కేంద్ర జల సంఘం, కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు కూడా లేవన్నారు. విభజన చట్టంలో వీటి ప్రస్తావనే లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ ప్రాజెక్టులు అనుమతులు లేని ప్రాజెక్టుల జాబితాలో ఉన్నట్లు చెప్పారు. అయినా తెలంగాణా ప్రభుత్వం దౌర్జన్యంగా నిర్మిస్తోందన్నారు. రెండు ప్రాజెక్టులు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా, వెలిగొండ, ఎస్ఆర్‌బిసి, నాగార్జున సాగర్, కృష్ణా డెల్టాకు నీరు అందక 50 లక్షల ఎకరాల సాగు భూమి బీడుగా మారుతుందని వివరించారు. తాగునీటి సమస్య ఏర్పడుతుందని తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తికి నీరు లేక రాష్ట్రం అంధకారం అవుతుందని పేర్కొన్నారు. పరిశ్రమలు మూత పడతాయన్నారు. ఇంత ప్రమాదం ముంచుకొస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు ఉండడం శోచనీయమని విమర్శించారు.

అసంపూర్తి పనులను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ 13వ వార్డులో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆ వార్డు కౌన్సిలర్, ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. మైదుకూరు రోడ్డులోని సైడ్ కెనాల్ ద్వారా మురుగునీరు సరిగా ప్రవహించడం లేదన్నారు. పాత్ హోల్ ఏర్పాటు చేసి పూడికలు తీస్తే సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. అవుట్ సోర్సింగ్ కార్మికులు గత కొద్ది రోజుల నుండి విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొనడం వల్ల పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. అందుబాటులో ఉన్న కార్మికులతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని కమిషనర్‌ను కోరారు. కార్మికుల డిమాండ్లు తెలిసేలా ప్రభుత్వానికి నివేదించాలని కమిషనర్‌ను కోరారు.

క్రైం కార్నర్

భార్యను హత్య చేసి అడవిలో పడవేసిన భర్త

- రెండు రోజుల తర్వాత తానే పోలీసులకు లొంగిపోయిన భర్త

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండలం పెద్ద చియ్యపాడులో సుజాత (36) తన భర్త చేతిలో హత్యకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. భర్త గోపాల్ వృత్తిరీత్యా ఓ ప్రయివేట్ బస్సు డ్రైవర్. తన భార్య గ్రామంలో ఇతర కులానికి చెందిన వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉందని గుర్తించాడు. ఆ సంబంధం వద్దని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో రెండు రోజుల క్రితం భార్యను హత్య చేశాడు. మృతదేహాన్ని గోనె సంచిలో వేసుకుని మైదుకూరు మండల పరిధిలోని ముద్దిరెడ్డిపల్లె అటవీప్రాంతం లోయలో వేశానని గోపాల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆ ప్రాంతాన్ని మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. భర్తే హత్య చేసి అడవిలో వేయడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

విచారిస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ (ఇన్‌సెట్) సుజాత (ఫైల్‌ఫొటో)

ఎస్‌సి కాలనీ రోడ్డు తొలగింపు

ఫిర్యాదుతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, రెవెన్యూ అధికారులు

తొలగించిన సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామ ఎస్‌సి కాలనీలోని రోడ్డును స్థానిక టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి శనివారం జెసిబి యంత్రంతో తొలగించారు. గ్రామస్తులు అందించిన వివరాలు ప్రకారం.. ఎస్‌సి కాలనీకి వెళ్లే రహదారిని 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేశారు. సిమెంట్ రోడ్డు వేసిన స్థలం తన పట్టా స్థలమని మల్లికార్జునరెడ్డి జెసిబి యంత్రంతో ఆ రోడ్డును తొలగించారు. ఆ సమయంలో ఎస్‌సి కాలనీ ప్రజలు ఉపాధి హామీ పనికి వెళ్లి ఉన్నారు. దీంతో రోడ్డు తొలగింపును అడ్డుకోలేకపోయారు. వారు పనులు ముగించుకుని వచ్చి చూడగా.. రోడ్డు తొలగించి ఉన్నారు. ఇది అన్యాయమని వారు ప్రశ్నించారు. డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపిడిఒ వీరకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ అధికారులు, పోలీసులు సమాచారం తెలుసుకొని గ్రామానికి చేరుకున్నారు. ప్రభుత్వ నిధులతో వేసిన సిమెంట్ రోడ్డును తొలగించడం చట్టరీత్యా నేరమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే తాత్కాలికంగా కాలనీలో చర్యలు చేపట్టారు. పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఎంపిడిఒ వీరకిషోర్, తహశీల్దార్ రమాకుమారి సమస్యపై సమగ్ర విచారణ చేపట్టారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ చిన్నపెద్దయ్య

ప్రతి మండల కేంద్రంలో సెంట్రల్ కిచెన్ షెడ్

స్థల పరిశీలనలో నియోజవర్గ ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి మండల కేంద్రంలో సెంట్రల్ కిచెన్ షెడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్, నియోజవర్గ ప్రత్యేక అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన సింహా ద్రిపురం జడ్పీ హైస్కూల్లో సెంట్రల్ కిచెన్ షెడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రంలో సెంట్రల్ కిచెన్ షెడ్డు ఏర్పాటు చేసి అక్కడ నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే సెంట్రల్ కిచెన్ షెడ్ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ-2 శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్ ప్రభు కుమార్ పాల్గొన్నారు

లింగాల : విద్యార్థుల సౌకర్యార్థం నాణ్యమైన భోజనం అందించడానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెంట్రల్ కిచెన్ ఏర్పాటుకు స్థలం అనువైందని డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆ మేరకు శనివారం ఎంఇఒ రామకృష్ణయ్యతో కలసి ఆమె స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండలానికొక సెంట్రల్ కిచెన్ షెడ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో ఈ పథకం కార్యరూపం దాల్చనుందన్నారు. మండల వ్యాప్తంగా 1,900 మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

సమస్త జీవరాశికి, పర్యావరణానికి పెనుముప్పులా మారిన ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి స్వయంగా పాల్గొని జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ వాడకం లేకుండా ఇతర పర్యావరణహిత ఉత్ప త్తులను ఉపయోగించుకోవాలని సూచించారు. రేపటి తరానికి ప్లాస్టిక్ రహిత ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. పోలీసులు క్రమశిక్షణతో ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అందరికి స్ఫూర్తి కలిగిస్తుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్‌డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, టైటస్, శివరాముడు, శ్రీశైల రెడ్డి, వీరేష్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లలో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్' : ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలోని పరిసరాలలో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి3వ శనివారమూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో ఎస్ఐలు, సిఐలు, సిబ్బంది పాల్గొని ఆయా పోలీసు స్టేషన్లు, పరిసరాలను శుభ్రం చేశారు. చీపుర్లు చేత పట్టి చెత్తా చెదారాన్ని ఊడ్చి అక్కడి నుంచి తరలించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. చిన్న చిన్న గుంతలు పూడ్చారు. పోలీసు స్టేషన్ల ఆవరణ, పరిసరాలలో మొక్కలు నాటి నీరు పోశారు.

కలెక్టరేట్‌లో స్వచ్ఛదివస్

కడప : స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులు వారివారి బ్లాకుల వద్ద 'ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే థీమ్‌తో క్లినింగ్ పరిశుభ్రత నిర్వహించారు. శనివారం ఉదయం ఓ బ్లాకు చుట్టూ పరిసరాలన్నింటిని ఆయా శాఖల అధికారులు స్వచ్ఛంధంగా పార, పలుగు పట్టి పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం అన్ని శాఖల వారు స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. దీంతో బ్లాకు చుట్టూ పరిసరాలన్నింటిని పరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ, పిఆర్‌ఒలు, ఇంజినీరింగ్, ఆయా శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో కలిగే హానికర ప్రభావాల గురించి వివరించారు. పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులైన డాక్టర్ అంకాల నాగరాజు, రమేష్ యాదవ్, శివ రామకృష్ణ, బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముద్దనూరు : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు వెలుగు, ఉపాధి, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలు, నష్టాల గురించి వివ రించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు శ్రీకాంత్, కరిష్మా, పోలీసుస్టేషన్లో ఎస్ఐ మైనుద్దీన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఇన్స్‌పెక్టర్ విన్నీలత ఆధ్వర్యంలో ఆయా శాఖల సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. ఎంఇఒ నాగేశ్వర నాయక్, డిప్యూటి ఎంపిడిఒ వీరభద్రుడు, ఎపిఒ గంగయ్య, ఎపిఎం అపర్ణదేవి, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, హెల్త్ సిహెచ్‌ఒ ప్రసాద్ యాదవ్, సూపర్‌వైజర్ రామారావు, వెలుగు సిసిలు ఇబ్రహీం, రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు కిరణ్ మధుకుమార్ పాల్గొన్నారు.

ముద్దనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

స్వచ్ఛ ఆంధ్రలో ఎస్‌పి, పోలీసు అధికారులు

వేంపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం పోలీసులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడవద్దని డాక్టర్ జయమ్మ పిలుపునిచ్చారు. పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా 'ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కళాశాల తరపున నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంతో వచ్చే అనర్థాలు, రోగాలు వివరించడంతోపాటు ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రధాన భవనం వెనుక భాగంలో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్త చెదా రాలను తొలగించారు. కార్యక్రమంలో ఇంజినీర్ నజ్మా, అధ్యాపకుడు డాక్టర్ జాకిర్ బాషా, పీడీ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ : ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలకండి.. పర్యావరణాన్ని పరిరక్షించండని అని వైద్యాధికారి హనీఫ్ బాబా పిలుపునిచ్చారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా డాక్టర్ హనీఫ్ బాబా ఆధ్వర్యంలో జమ్మలమడుగు డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి గీత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకం మానివేస్తామని స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర దిశగా ముందడుగు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ కృష్ణమ్మ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిపిఎంఒ శ్రీను, హెల్త్ సూపర్‌వైజర్స్ వరప్రసాద్, చంద్రకళ, సీనియర్ అసిస్టెంట్ మధు, ఫార్మాసిస్ట్ సురేంద్ర, ల్యాబ్ టెక్నీసియన్ ప్రసాద్, హెల్త్ అండ్ వెలనెస్ సెంటర్స్ సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఒపి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఖాజీపేట : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరి రక్షణకు పాటు పడాలని ఎంపిడిఒ దివిజా సంపతి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్య క్రమం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి కొన సాగిన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు బస్టాండ్ కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. ఎపిఎం శైలజ, మేజర్ పంచాయతీ సెక్రె టరీ రమణా రెడ్డి, జిల్లా పరిషత్ బాలికల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు, ప్రొద్దుటూరు నందు
O.S.No.36/2018

గోసుల రవీంద్రా రెడ్డి S/o చిన్న మల్లా రెడ్డి
కానపల్లి గ్రామం,ప్రొద్దుటూరు(మం),కడప జిల్లా ..వాది
VS
కనపర్తి చంద్రకాంత్ రెడ్డి S/o మోహన్ రెడ్డి,24 సం॥,
వెదురూరు గ్రామం,చాపాడు(మం),కడప జిల్లా
...ప్రతివాది

3వ ప్రతివాదికి దావా సమను

పై దావాలోని వాది రూ.18,73,000-00 మొత్తం రాకోరుచూ 1వ వాది అయిన కనపర్తి మోహన్ రెడ్డి మీద దావా దాఖలు చేసి యున్నారు. సదరు మోహన్ రెడ్డి చనిపోయినందున వారుసులైన మీ మీద దావా పరిహారం కోరుతూ దావాను వేసి ఉన్నారు. అట్టి దావా యందు కోర్టువారి సమన్లు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై దావా నందు మీకు **24-07-2025**వ తేదీన వాయిదా ఉంటున్నది. కావున మీరు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టు నందు పై తేదీన ఉదయం 10-30 గంటలకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనందట మీ పరోక్షమున పై దావాను తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
జింకా రవి, అడ్వకేట్, ప్రొద్దుటూరు,

రాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో
O.S.No. 1012/2020

The Suit is filed under Rep.in public in general of Krishnapuram & Ramarajupalli Village of C.K. Dinne Mandal.
1. శ్రీమతి ఎమ్.రమాదేవి & ముగ్గురు ఇతరులు.
...వాదులు
Vs
1. బైరెడ్డి రామక్రిష్ణారెడ్డి & ముగ్గురు ఇతరులు.
...ప్రతివాదులు

పై దావాలో 2వ ప్రతివాది జి.చంద్రశేఖర్‌నకు పత్రికా ముఖముగా సమను

To
D2. జి.చంద్రశేఖర్, S/o జి.సుబ్బిరెడ్డి, హిందూ, డోర్‌నెం. 28/808-బి4, ఎన్జీఓ కాలనీ, నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా.

అను మీరు 2వ ప్రతివాదిగా మరియు ఇతరుల మీద, వాదులు దావా దాఖలా ఆస్థిపై పర్మినెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పై దావాను సలుపగా, సదరు దావాలో మీ యొక్క హాజరు మరియు ఆక్షేపణలకు గాను వాయిదా 12.08.2025వ తేదీకి వున్నది. కావున సదరు 12.08.2025వ తేదీ ఉ.గం.10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపు కోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

తేది: 20/7/2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్. సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.

ఆర్‌డిఒతో మాట్లాడుతున్న యురేనియం బాధిత రైతులు

టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచొద్దు

- ఆర్‌డిఒను కోరిన యురేనియం బాధిత రైతులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచవద్దని యురేనియం బాధిత గ్రామాల రైతులు ఆర్‌డిఒ చిన్నయ్యను కోరారు. వేముల మండలంలోని మబ్బు చింతలపల్లి సమీపంలో ఉన్న యురేనియం కర్మాగారం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం పులివెందుల పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుని యురేనియం కంపెనీ నుండి వచ్చే వ్యర్థాలను నిలువ చేసే టెయిలింగ్ పాండ్ ఎత్తును పెంచడానికి వీల్లేదన్నారు. టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచేందుకు తాము అనుమతి ఇచ్చేదిలేదని పేర్కొన్నారు. తాము అనుమతి ఇవ్వాలంటే సంబంధించిన భూముల రైతులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెయిలింగ్ పాండ్ వల్ల ఆయా గ్రామాల్లో ఎక్కువగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిపారు. గర్భం రావడం లేదని, వచ్చినా మధ్యలోనే పోతోందని వివరించారు. ప్రస్తుతం గ్రామంలో నివసిస్తున్న ప్రజలు, పశువులకు చర్మ వ్యాధులు, అంటువ్యాధులు, కీళ్ల క్యాన్సర్ వంటి రోగాలతో బాధ పడుతున్నామన్నారు. పూర్తిస్థాయిలో తమకు న్యాయం జరిగితేనే ఎత్తు పెంచేందుకు ఒప్పుకుంటామన్నారు. ఆర్‌డిఒ స్పందిస్తూ టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచేందుకు కాకుండా మరమ్మతుల కోసం రెండు రోజులు మట్టి తోలుకునేందుకు అవకాశం కల్పించాలని రైతులను వారు అంగీకరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మున్సిపల్ చైర్మన్ మాట మార్చడం తగదు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర రోజుకోమాట మార్చడం తగదని వైస్ చైర్మన్ షరీఫ్ పేర్కొన్నారు. మైదుకూరు వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డికి తాను ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర గతంలో పేర్కొన్న వీడియోలను ప్రదర్శించారు. ప్రస్తుతం పుట్టా సుధాకర్ యాదవ్ వైపు చేరి మాజీ ఎమ్మెల్యేను విమర్శించడం తగదన్నారు. వైసిపిలో ఉన్నప్పుడు పుట్టా సుధాకర్ యాదవ్‌ను విమర్శించి.. ప్రస్తుతం ఆయనకు అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. కో-ఆప్షన్ మెంబర్ ఎంఆర్‌ఎఫ్ సుబ్బయ్య మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే వైసిపికి ప్రజలు పట్టం కడతారన్న మాటకే టిడిపి నాయకులు ఉలిక్కిపడ్డారన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు భరత్‌కుమార్ రెడ్డి, శివరాం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి కడప పార్లమెంట్ కార్యదర్శిగా 'రెడ్యం'

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి కడప పార్లమెంట్ కార్యదర్శిగా రెడ్యం వెంకట సుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం జాబితా విడుదల చేసింది. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని రెడ్యం పేర్కొన్నారు. వైసిపి నాయకులు రెడ్యంను కలిసి అభినందనలు తెలిపారు.

జీతాలు పెంచాలని కార్మికుల వినతి

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు పెంచి ఆదుకోవాలని కార్మి కులు కోరారు. శని వారం సర్పంచ్ రాచి నేని శ్రీనివాసులును గ్రామ పంచాయతీలో ఆయా విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు అందరూ కలిసి తమ బాధలను వెలుబుచ్చారు. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న తమకు అరకొర జీతాలు ఇస్తుడడంతో కుటుంబ పోషణ బంరువైందని వాపోయారు. జీతాలు తక్కువ కావడంతో పిల్లలను చదివించుకోలేక పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. తాము ఏళ్ల తరబడి ప్రజలకు అనేక సేవలను చేస్తున్నట్లు వివరించారు. వేతనాలు పెంచకుండా బానిసలుగానే అధికారులు పని చేయించు కొంటున్నారని వాపోయారు. పంచాయతీలో పని చేసే కార్మికుల జీతాలు విషయంపై పట్టించుకోకపోవడం లేదని చెప్పారు. పెండింగ్ వేతనాలను కూడా చెల్లించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు కోరారు. స్పందించిన సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వేతనాలు పెంచాలని సర్పంచ్‌ను కోరుతున్న కార్మికులు

రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో
O.S.No. 658/2020 & I.A.No.357/2020
O.S.No. 658/2020

1. ఎమ్.చెన్నమ్మ
2. ఎమ్. వెంకటమ్మ ...వాదులు
Vs
1. ఎమ్. పెద్ద వెంకటసుబ్బయ్య మరియు ఇతరులు
...ప్రతివాదులు

పై దావాలో ప్రతివాదులు నెం.1,2,4 మరియు 18లకు సమనులు & I.A.No.357/2020 నందు రెస్పాండెంట్లు నెం.1,2,4 & 18లకు నోటీసులు

To
D1. మాడపూరి పెద్ద వెంకట సుబ్బయ్య, S/o ఎమ్.చిన్న సుబ్బయ్య @ నడిపయ్య.
D2. మాడపూరి చిన్న వెంకట సుబ్బయ్య, S/o ఎమ్. చిన్నసుబ్బయ్య @ నడిపయ్య
1&2 ప్రతివాదుల నివాసం ముత్రాసుపల్లె, H/o చిన్నచౌక్, కడప నగరం.
D4. మాడపూరి లలితమ్మ, D/o ఎమ్. చిన్నసుబ్బయ్య @ నడిపయ్య, రైల్వేకొండాపురం (గ్రా&మం), వైఎస్ఆర్ కడప జిల్లా.
D18. పుల్లగూర సుబ్రమణ్యం, S/o వెంకటసుబ్బయ్య, డోర్ నెం.1/377, మారుతినగర్, కడప నగరం, వైఎస్ఆర్ కడప జిల్లా.

అను మీరు 1,2,4 & 18వ ప్రతివాదులుగా మరియు ఇతరుల మీద, పై తెలిపిన వాదులు, దావా దాఖలా ఆస్థిపై భాగపరిష్కారం కోరుచూ పై దావాను సలుపగా సదరు దావాలో మీ యొక్క హాజరుకు గాను 28.07.2025వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 28.07.2025వ తేదీ ఉ.గం.10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్నయెడల కోర్టు వారికి తెలుపు కోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు. పై దావాలో I.A.No. 357/2020 నందు కూడా మీ యొక్క హాజరుకు గాను మరియు పై పిటీషన్‌లో అభ్యంతరాలకు గాను 28.07.2025వ తేదీకి వాయిదా వున్నది.

తేది: 20/7/2025
//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
ఎమ్. సుధాకర్ బాబ్జీ
వకీలు, కడప.